కపట మనిషి

టెంపోరావ్

ఎనిమిది దాటింది. హాల్లో రెండు ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశిస్తున్నాయి. తెరచిన కిటికీల్లోంచి చల్లటి గాలి వీస్తోంది.

గ్లాసులో మళ్ళీ విస్కీ పోసి, కొద్దిగా సోడా కలిపాను. విస్కీ తాగుతూ, సిగరెట్ పీలుస్తూ గుమ్మంకేసి చూశాను. వంటతను కృష్ణయ్య నవ్వుతూ నాకేసి చూస్తున్నాడు.

"పార్వతి ఇంకా రాలేదా!" అన్నాను.

"దేవాలయంలో ఆలస్యమై వుంటుందిసార్. ఈపాటికి వస్తూవుంటారు!" అన్నాడతను.

పక్కింటి సావిత్రమ్మతో స్నేహం అయ్యాక పార్వతికి దేవాలయాల పిచ్చి ఎక్కువైంది. ప్రతి రోజూ ఏదో దేవా

లయానికి వెళ్ళి తిరిగొచ్చి ప్రసాదాన్ని అందర్కీ ఇస్తూ వుంటుంది.

టెలిఫోన్ మ్రోగింది. వెళ్ళి రిసీవర్ని అందుకున్నాను. అటువైపునుంచి ఇన్‌స్పెక్టర్ నాయర్ కంఠం వినపడింది.

"హలో, నాయర్ భాయ్!"

"బ్రదర్, వెంటనే రాగలవా?"

"ఎక్కడికి?"

"అందమైన ఒకమ్మాయి నూతిలోపడి మరణించింది. శవాన్ని బయటకు లాగాం. ఆమె ముఖాన్ని చూడగానే నీకు ఫోన్ చెయ్యాలనిపించింది!"

"ఆత్మహత్యా?!

"ఇంకా ఏమీ తెలియదు."

"నువ్వెక్కడున్నావు?"

నాయర్ చెప్పాడు. వస్తున్నానని చెప్పి రిసీవర్ని పెట్టేశాను.

గ్లాసులోని విస్కీ తాగేసి మరో సిగరెట్ వెలిగించాను. కోటు తొడుక్కుని గబగబా మెట్లు దిగాను. కిందనున్న క్రిష్ణయ్యకేసి ఓరగా చూశాను.

"పనిమీద వెళ్ళానని పార్వతితో చెప్పు!" అని షెడ్డువైపు పరుగెత్తాను.

డాడ్జి కారును స్పీడుగా పోనిచ్చాను. పల్లివాకం ప్రాంతంలో గైలుపట్టాల ప్రక్కనేవుందా నుయ్యి. పోలీస్ జీప్ వెనకనే డాడ్జికారును ఆపాను. కారు దిగి నూతివైపు నడిచాను. ఎలక్ట్రిక్ లైట్లు లేవు. టార్చికాంతిలో లోన చూసుకుంటూ వెళ్ళాను. నూతి పక్కన పెట్రోమాక్స్ లైట్ వెల్గుతోంది. ఇన్‌స్పెక్టర్ నాయర్ గబగబా వచ్చి నా చెయ్యి పట్టుకున్నాడు.

పెద్ద నుయ్యి. దగ్గరగా వెళ్ళి కిందకి చూశాను. నీళ్ళు కనపడ్డాయి. పెట్రోమాక్సు లైట్ కాంతిలో నూతిపక్క పడున్న శవాన్ని చూశాను. ఆమె వయస్సు ఇరవైలోపు వుంటుంది. కాటన్ చీర, తెల్ల జాకెట్ ధరించింది. చీర కిందున్న పాదాలు కనిపిస్తోంది. పొట్ట బాగా వుబ్బింది. ముఖం వికృతంగా మారింది.

ట్రెయిన్ కూత వినపడింది. కాస్సేపట్లో మా పక్క నున్న పట్టాలమ్మట ఏదో రైలుబండి దూసుకుపోయింది. టైమ్ చూశాను. ఎనిమిదిన్నరైంది. నీలగిరీ ఎక్స్‌ప్రెస్ అయి వుండాలి!

సిగరెట్ వెలిగించి పీలుస్తూ నలువైపులా చూశాను. దూరంలో ఇళ్ళున్నాయి. రెండు ఫర్లాంగుల దూరంలో విల్లివాకం స్టేషన్ లైట్లు కనిపిస్తున్నాయి. కానిస్టేబుల్సు నూతి దగ్గర నిలబడ్డారు.

"ఈమె యీ ప్రాంతంలో వుంటోందేమో!" అన్నాను.

కొందరు ప్రజలు దూరంలో నిలబడి నూతికేసి భయంతో చూస్తున్నారు.

"బ్రదర్, ఇంకా ఎవ్వరూ ఆమెను పోల్చలేదు," అన్నాడు నాయర్.

సమీపంలో నిలబడిన వాళ్ళవైపు నడిచాను.

"ఆమె ఎవరో మీకు తెలుసా?" అడిగాను.

"తెలియదు, సార్!" అన్నాడొకతను.

"ఈ నుయ్యి ఇక్కడెందుకుంది?"

"మూడేళ్ళ క్రితం నీళ్ళులేని సమయంలో ప్రభుత్వం యీ నూతిని తవ్వించింది. ఇది పబ్లిక్ బావి. ఎవరేనా ఇక్కడకొచ్చి బట్టలు వుతుక్కుంటూ వుంటారు," అన్నాడు మరొకతను.

శవం ఫోటోలు తీస్తున్నారు. ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నాను. రోడ్డుమీద కారు ఆగిన చప్పుడైంది. కానిస్టేబుల్ పోలీస్ డాక్టర్‌ని మా దగ్గరకు తీసుకొచ్చాడు. డాక్టర్ ఛార్లెస్ నాతో కరచాలనం చేసి శవ పరీక్షకు ఉపక్రమించాడు.

సిగరెట్ పీలుస్తూ డాక్టర్ ముఖాన్ని గమనిస్తున్నాను. అతను ఆశ్చర్యంగా నా కేసి చూస్తూ లేచి నిలబడ్డాడు.

"మిస్టర్ పరశురామ్, ఈమెను ఎవరో అమానుషంగా రేప్ చేశారు. నూతిలో పడి నీళ్లు తాగి యీమె మరణించింది," అన్నాడు డాక్టర్.

"ఇది హత్య కావచ్చు!" అన్నాను.

"అవును బ్రదర్. రేప్ చేసి నతను యీమెను నూతిలోకి తోసేసి వుండొచ్చు," అన్నాడు నాయర్.

"అలా ఎందుకు చేస్తాడు?" అడిగాను.

"అత నామెకు పరిచయమైన మనిషి కావచ్చు. పరాయివాడైతే రేప్ చేసి పారిపోయేవాడు."

"యూ ఆర్ రైట్," అన్నాను సాలోచనగా.

* * *

పది దాటింది. ఐ. సి. ఎఫ్ కోలనీలోని ఒక ఇంటి ముందు కారాపి దిగాను. కొత్తగా కట్టిన డాబా ఇల్లు. ఇంటి చుట్టూ ప్రహరీ గోడకు బదులు పొడుగాటి మొక్కలున్నాయి. వీధి గేటు తలుపు కొబ్బరాకులతో నిర్మించబడింది. ఆకుల తలుపు వెనక్కి పడివుంది.

లోపలకు వెళ్ళాను. ముందున్న హాల్లో లైట్ వెల్గుతోంది. ఒకతను నావైపు అదోలా చూశాడు.

"మిస్టర్ రాజన్!" అన్నాను.

"నేనే సార్," అన్నాడతను.

ముందు గదిలోకి వెళ్ళాను. మధ్య తరగతి కుటుంబం. పేము కుర్చీ చూపించి అతను నన్ను కూర్చోమన్నాడు.

ఒక స్త్రీ లోపలి గుమ్మంలో నిలబడివుంది.

"మీ అమ్మాయి ఫోటో వుందా?"

"పద్మా, అమ్మాయి ఫోటో పట్రా!" అన్నాడతను.

కాన్వేపట్లో ఫ్రేమ్ కట్టిన ఒక ఫోటోను ఆమె అతని కిచ్చింది. గ్రూప్ ఫోటో. అందులో వున్న కూతురువైపు అతను చూపించాడు. ఆమె ఫోటోను చూసి తృళ్ళి పడ్డాను. నూతి పక్క పడున్న శవం నాకు గుర్తుకొచ్చింది!

"మీరు ఏం చేస్తున్నారు?"

"ఐ. సి. ఎఫ్‌లో పనిచేస్తున్నాను."

"ఈ ఇంట్లో ఎంత కాలంనుంచి వుంటున్నారు?"

"గృహప్రవేశం చేసి ఇంకా సంవత్సరం కాలేదు. ప్రావిడెంట్ ఫండ్ మీద అప్పుచేసి ఇల్లు కట్టించాను."

"మీ అమ్మాయి ఏం చేస్తోంది?"

"కాలేజీలో పీ. యూ. చదువుతోంది. ప్రతి రోజూ ట్రెయిన్‌లో సెంట్రల్‌కి వెళ్ళి అక్కడనుంచి బస్సులో కాలేజికి వెళ్ళవస్తుంది."

అతనికేసి సూటిగా చూశాను.

"మిస్టర్ రాజన్, మీ అమ్మాయి చనిపోయిందని చెప్పడానికి చాలా విచారిస్తున్నాను," అన్నాను.

ఫోటో పట్టుకొచ్చినామె ఏడుస్తూ లోపల కెళ్ళింది. రాజన్ కన్నీళ్ళతో నా వైపు చూశాడు.

"మా అమ్మాయి రేవతి నిజంగా మరణించిందని మీకు తెలుసా?"

"విల్లివాకం స్టేషన్‌కి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న నూతి పక్కనే రేవతి శవం పడుంది. మీరు నాతో వస్తే చూపిస్తాను."

అతను లేచాడు. లోపలకు వెళ్ళి చొక్కా తొడుక్కుని వచ్చాడు. అతను కార్లో కూర్చున్నాక తలుపు మూసి కారును పోనిచ్చాను.

పక్క కూర్చున్న అతని కేసి ఓరగా చూశాను.

"ఆమె విల్లివాకంలో దిగి ఇంటికి వస్తూ వుండేదా?"

"అవును, సార్. ఆ స్టేషన్కి మా ఇల్లు దగ్గరలో వుంది."

విల్లివాకం గోడమ్మట కారు కదుల్తోంది.

"అమ్మాయి ఎవర్నైనా ప్రేమించిందా?"

అతను కోపంగా నాకేసి చూశాడు. కారును ఆపాను. ఇద్దరం దిగాం.

నూతి దగ్గరకు నడిచాం. రేవతి శవం స్ట్రెచర్ మీదుంది.

"యాంబులెన్స్ వచ్చింది. పోస్ట్ మార్టమ్కి పంపుదాం అనుకుంటున్నాను!" అన్నాడు ఇన్స్పెక్టర్ నాయర్.

శవాన్ని చూసి రాజన్ పిచ్చిగా అర్చాడు. ఏడుస్తూ నేలమీద కూలిపోయాడు.

"ఆమె తండ్రి మిస్టర్ రాజన్," అన్నాను ఇన్స్పెక్టర్ నాయర్తో.

అతడిని నాయర్కి అప్పగించి కారులో వెళ్ళిపోయాను. రాజన్ ఇంటిముందు మళ్ళా కారాపి దిగాను. ముందు గదిలోకి వెళ్ళాను. రేవతి తల్లి ముందు గదిలో కూర్చుని ఏడుస్తోంది. ముగ్గురు పిల్లలు ఆమె పక్కనే కూర్చుని విలపిస్తున్నారు.

ఎదురుగా నిలబడి ఆమెకేసి సూటిగా చూశాను. "రేవతికి అన్యాయం జరిగింది. ఎవరో ఆమెను రేప్ చేసి నూతిలోకి తోసేశారు!" అన్నాను.

"ఆ దుర్మార్గుడితో తిరగొద్దని చెప్తే వినలేదు!" అందామె.

"ఎవరతను?"

"బాజీరావు."

"అత నెక్కడుంటున్నాడు?"

ఆమె లోపలకు వెళ్ళింది. ఒక బౌండు పుస్తకాన్ని తెచ్చి నాకిచ్చింది. అట్టమీద బాజీరావు అడ్రెస్ రాసి వుంది. అతను మైలాపూరులో వుంటున్నాడు.

"దీన్ని గురించి ఆయనకు చెప్పకండి! నాకు తెలిసినా ఆయనకు తెలియకుండా దాచాను," అందామె.

"ఇది మీ భర్తతో చెప్పకుంటే ఆమె కలాంటి దుర్మరణం సంభవించేది కాదేమో!" అన్నాను.

"ఆయన హార్ట్ పేషెంట్, ఇటువంటి దేదేనా వింటే గుండె ఆగిపోతుందని నాభయం."

వెనక్కి తిరిగి బయటకొచ్చాను.

"ఆయన అక్కడే వున్నారా?" అడిగిందామె.

"కాస్సేపట్లో పోలీసు జీప్ లో ఆయనిక్కడికి కొస్తారు," అని కారు వైపు నడిచాను.

కారులో కూర్చుని సిగరెట్ వెలిగించాను. నలువైపులా చూశాను. అన్నీ కొత్త ఇళ్ళు. ఐ. సి. ఎఫ్ కోలనీ ఇళ్ళలోని వాళ్ళు లైట్లు ఆర్పేసి సుఖంగా నిద్రపోతున్నారు.

కారును పోనిచ్చాను. పట్టాలమ్మట ఏదో ట్రెయిన్ వెళ్తూన్న ధ్వని వినపడ్తోంది. ఎవరు చచ్చినా రైళ్ళు ఆగవు, కదుల్తూనే వుంటాయి!

మైలాపూర్ వీధుల్ని చూస్తూ కార్ని పోనిస్తున్నాను. ఆర్మగం వీధి బోర్డు చూసి కార్ని కుడివైపుకు తిప్పాను. నంబర్ 12 ఇంటిముందు కారాపాను.

వీధి దీపాలు వెలుగుతున్నాయి. బాజీరావు కోసం తలుపు తట్టి అందర్నీ లేపాలి! కార్లోంచి దిగాను. కాళ్ళ చప్పుడై ఆగాను. ఎవరో కారు వైపు నడిచి వస్తున్నారు.

"మిస్టర్, ఏం కావాలి?" అన్నాడతను.

అతనికేసి సూటిగా చూశాను. పొట్టిగా, లావుగా వున్నాడు. పొడుగాటి సైడ్ లాక్స్, పెద్ద మీసాలు, వైట్ పాంట్, స్లాక్ ధరించాడు. కాళ్ళకు స్లిప్పర్స్ వున్నాయి. ఎడమచేతికి డేట్ సెట్ వాచ్!

"బాజీరావు నువ్వేనా?"

"నేనే!" అన్నాడతను.

అతని వైపు సీరియస్ గా చూశాను.

"విల్లివాకం నుంచి రావడానికి ఇంత ఆలస్యమైందా?" అన్నాను చటుక్కున.

"ఏమిటి మీరనేది?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎక్కడనుంచి వస్తున్నావు?"

"సినిమాకెళ్ళి, బీచ్ లో కాస్సేపు ఫ్రెండ్ తో కూర్చుని వస్తున్నాను."

"ఎవరా ఫ్రెండ్?"

"రాఘవన్. రాయపేటలో వుంటున్నాడు."

"రేవతి నిన్న సాయంత్రం మాయమైంది. ఆమెను నిన్న కల్సుకొన్నావా?"

కాస్సేపు అతను మాట్లాడలేదు. బాధతో నా వైపు చూస్తూండి పోయాడు.

"రేవతి దొరికిందా?"

"నా ప్రశ్నకు జవాబియ్యి."

"నిన్న ఆమెను కల్సుకొన్నాను. కాలేజి బయట ఇద్దరం కలుసుకొన్నాం. మెరీనా కేంటీన్ లో టిఫిన్ తిని

కాస్సేపు బీచ్‌లో కూర్చున్నాం. తర్వాత ఆమెను బస్సెక్కించి నేను ఇంటికి వెళ్ళిపోయాను,'' అన్నాడు బాజీరావు.

''నువ్వు నాతో రావాలి!''

''ఎక్కడకి సార్?''

''కార్లో కూర్చో,'' అన్నాను అధికారంతో.

అతను కార్లో కూర్చుని తలుపు మూశాడు. కారును మెల్లిగా పోనిచ్చి మెయిన్ రోడ్డుకి తిప్పాను.

''మిస్టర్ బాజీరావు, నువ్వు ఏం చేస్తున్నావు?''

''ఉద్యోగం కోసం వెతుకుతున్నాను. బి. ఎ. పాసయ్యాను. ఇంకా చదవడానికి డబ్బు లేదు.''

''రేవతితో నీకెలా పరిచయమైంది?''

''ఒకరోజు ఆమెను బీచ్‌లో చూశాను. ఆమె నన్ను ఎంతో ఆకర్షించింది. అటుపైన బస్టాప్‌లో ఆమె కోసం నిలబడే వాడ్ని. అలా దగ్గరయ్యాను.''

''ఆమెను పెళ్ళాడాలనుకున్నావా?''

''పెళ్ళాడాలనే నా వుద్దేశం.''

సడన్‌గా కారున్ని ఆపాను. అతనికేసి చూశాను.

''రేవతిని ఎవరో రేప్ చేశారు. నూతిలో పడున్న ఆమె శవాన్ని పోలీసులు పైకి లాగారు,'' అన్నాను.

బాజీరావు వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. కారును పోనిచ్చాను.

''పువ్వులాంటి ఒక అమాయకపు యువతి జీవితాన్ని ఎవడో దుర్మార్గుడు నలిపి పారేశాడు. వాడెవడో కనుక్కుని చిత్రవధ చేస్తాను,'' అరిచాడతను.

అతను నటించడం లేదనిపించింది. అతని చెయ్యి పట్టుకున్నాను.

"నిన్న రాత్రి ఆమె ఏ బస్సెక్కింది?"

"సెంట్రల్ స్టేషన్ కి వెళ్ళే బస్, సార్."

నా మెదడులో ఆలోచనలు తిరుగుతున్నాయి. రేవతి హుషారుగా అతనితో మాట్లాడింది. బస్టాప్ కి కూడా వెళ్ళి అతను బస్సెక్కించాడు. సెంట్రల్లో బస్సు దిగి ఆమె ట్రెయిన్ లో విల్లివాకం వెళ్ళాలి. సెంట్రల్లో మరెవరేనా ఆమెను కలుసుకున్నారా?

కారు నలభై కిలోమీటర్ల స్పీడులో వెళ్తోంది.

"రేవతి నీకన్నివిధాలా దగ్గరైందా?"

"మనసారా ఆమెను ప్రేమించాను, సార్. ఆమెను నేనెప్పుడూ ముట్టుకోలేదు. మాట్లాడుకునే వాళ్ళం."

రేవతిని మరెవరో బలాత్కరించి వుండాలి. ట్రెయిన్ ఎక్కేముందో, ట్రెయిన్ లోనో ఎవరో ఆమెను కలుసుకుని ఎక్కడకో తీసుకుపోయి వుండాలి!

జనరల్ హాస్పిటల్ ముందు కారు ఆపాను. ఇన్ స్పెక్టర్ నాయర్ జీప్ గోడు వారగా వుంది. ఒక కానిస్టేబుల్ నా కారువైపు పరుగెత్తుకొచ్చాడు.

"ఇతనికి శవాన్ని చూపించండి," అన్నాను బాజీరావు కేసి చూపిస్తూ.

అతను కార్లోంచి దిగాడు. కారుచుట్టూ తిరిగి నేను కూర్చున్న వైపుకి వచ్చాడు.

"నీకేదేనా తెలిస్తే వెంటనే యీ నెంబర్ కి ఫోన్ చెయ్యి!" అని అతనికి నా కార్డు ఇచ్చాను.

స్ట్రీట్ లైట్ కాంతిలో అతను చూశాడు. గౌరవపూర్వకంగా నాకు నమస్కరించాడు.

"పరశురామ్ గారూ, రేవతి మంచి పిల్ల. ఈ ఘోరం ఎలా జరిగిందో కనుక్కోండి!" అన్నాడతను.

"అదే పనిలో వున్నాను," అని కాల్చు పోనిచ్చాను.

* * *

టైమ్ పది దాటింది.

టిఫిన్ తిని, నాలుగు కప్పుల స్ట్రాంగ్ కాఫీ తాగి హాల్లో సిగరెట్ పీలుస్తూ కూర్చున్నాను.

పార్వతి నా పక్కనే కూర్చుని కమ్మగా కబుర్లు చెప్తోంది. టెలిఫోన్ మ్రోగింది. వెళ్లి రిసీవర్ని అందుకున్నాను. అటువైపు కంఠంలో గాభరా ధ్వనిస్తోంది.

"పరశురామ్ గారూ!"

"యస్ స్పీకింగ్!"

"బాజీరావుని, సార్! నిన్న రేవతి రాసిన వుత్తరం నాకిప్పుడు అందింది."

"ఏం రాసింది?"

"ఆమె చాలా రాసింది సార్!"

"నువ్వెక్కడున్నావు?"

"అజంతా హోటల్ పక్కనున్న టెలిఫోన్ బూత్ లో."

"అక్కడే వుండు-వస్తున్నా!"

రిసీవర్ని పెట్టేసి కోటు తొడుక్కున్నాను. పార్వతి వైపు చూసి నవ్వుతూ కిందకి పరుగెత్తాను.

అజంతా హోటల్ సమీపంలో వున్న టెలిఫోన్ బూత్ పక్కనే కారాపాను. బాజీరావు కారు వైపు వడివడిగా వచ్చాడు. ఒక కవర్ని నాకిచ్చాడు. కవర్ లోంచి వుత్తరాన్ని బయటకు లాగాను.

"మైడియర్ బాజీ,

కొన్ని గంటల్లో నా జీవితం ఇలా తారుమారవుతుందని కలలో కూడా అనుకోలేదు. సెంట్రల్ దిగి నడుస్తూంటే

ఒకామె ఎదురైంది. అమ్మ హాస్పిటల్లో వుందని చెప్పి నన్ను అక్కడకు రమ్మంది. ఆమెతో కారెక్కాను. అంతే_తెలియకుండా బోనులో ఇరుక్కున్నాను.

"బాజీ, తర్వాత జరిగిందంతా వివరంగా చిత్రించి నిన్ను బాధించను. వుద్యోగం దొరికాక నిన్ను పెళ్ళాడి సుఖంగా వుండొచ్చు అని అనుకునేదాన్ని. దానికి నేను నోచుకోలేదని రుజువైంది. విధి అలా వుంది.

"బాజీ, సకల రోగాలూ తనలో జీర్ణించుకున్న ఒక కిరాతకుడు నన్ను బలాత్కరించి, నా శీలాన్ని నాశనం చేశాడు. ఆకలి తీరాక నన్ను రోడ్డుమీద వదిలేశాడు. ఏ మొహం బెట్టుకుని ఇంటికెళ్ళను? నిన్ను ఎలా పెళ్ళాడ గలను? ఒక నిర్ణయానికి వచ్చాను. ఆ నుయ్యి నాకు ఎప్పుడూ కనిపిస్తూ వుంటుంది. అదే నాకు శరణం!

మలిన స్థితిలో నీవద్దకు రాలేక మరో లోకానికి పోతు న్నాను. నన్ను మర్చిపో!

రేవతి."

ఉత్తరాన్ని మడిచి కవర్లో పెట్టి అతనికేసి జాలిగా చూశాను. రేవతి శవం గుర్తుకొచ్చింది. ఆత్మహత్య!

"బాజీరావు, ఈ వుత్తరాన్ని వెంటనే ఇన్స్పెక్టర్ నాయర్ కి అందజేయి," అన్నాను.

అతను తలాడించాడు. అతని కళ్ళమ్మట నీళ్ళు కారు న్నాయి.

"పరశురామ్‌గారూ, రేవతి తొందరపడింది. నాతో జరిగింది చెప్పివుంటే నేను మన్నించేవాడిని. ఎవరో బలా త్కారంగా ఆమెను ఏదో చేస్తే తప్పు ఆమెదికాదు. అన వసరంగా ఆత్మహత్య చేసుకుంది!" అన్నాడతను.

"ఆమె తండ్రికికూడా ఇలా ఉత్తరం రాసిందేమో!"

"అదిగి చూడండి!"

అప్పుడే వచ్చిన బస్సువైపు అతను పరుగెత్తాడు. కార్ను పోనిచ్చాను. ఐ. సి. ఎఫ్ కాలనీలోని ఇంటిముందు కారా పాను. దిగి లోపలకు వెళ్లాను. రాజన్ నన్ను చూసి లేచి నిలబడ్డాడు.

"పరశురామ్ గారూ, ఆ దుర్మార్గుడు దొరికాడా?" అడిగాడతను.

"దుర్మార్గులు అంత తొందరగా దొరకరు!" అన్నాను.

"రోజులు మారాయి, సార్. మనుషులు దారుణంగా ప్రవర్తిస్తున్నారు."

"మీకేమైనా ఉత్తరం వచ్చిందా?"

"లేదు," అన్నాడతను.

ఇంటిముందు స్కూటర్ ఆగింది. రాజన్ బయటకు గబగబా వెళ్ళాడు. స్కూటర్ మీద కూర్చున్నతనితో ఏదో మాట్లాడుతున్నాడు. లోపల గుమ్మంవైపు చూశాను. అతని భార్య కనిపించింది. దగ్గరగా వెళ్ళాను. ఆమె ఒక కవర్ని నాకు అందించింది.

ఏడ్చి ఏడ్చి ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి.

"పరశురామ్ గారూ, ఈ ఉత్తరం వచ్చినట్లు ఆయనకు తెలియదు. దయచేసి చెప్పకండి!"

ఉత్తరాన్ని జేబులో పెట్టుకు బయటకు నడిచాను. రాజన్ ఎదురయ్యాడు.

"కూర్చోండి సార్!" అన్నాడతను.

"పనుంది, మళ్ళీ వస్తాను!" అని కారువైపు గబగబా వెళ్ళాను.

కార్ను కొంచెందూరం పోనిచ్చి గోడ్డువారగా ఆపాను. ఉత్తరాన్ని బయటకులాగి చదవసాగాను.

"ప్రియమైన అమ్మకి,

అనుకోని పరిస్థితుల్లో నా సర్వస్వాన్నీ పోగొట్టుకున్నానమ్మా! నాకు మానభంగం జరిగింది. వాడి రోగాలతో నా రక్తం చెడిపుంటుంది. ఈ స్థితిలో ఇంటికి రావడానికి నాకు మనసొప్పడంలేదు. అందువలన మరో లోకానికి ప్రయాణంకడుతున్నాను. బాజీ మూలంగా నాకు ఏ హానీ జరగలేదు. అతను యోగ్యుడు. ఈ ఉత్తరం నీకు అందేసరికి నే నీ లోకంలో వుండను.

అమ్మా! బాధపడకు! మరో జన్మనేదివుంటే నీకడుపున మళ్ళీ పుట్టాలని నా ఆఖరి కోర్కె.

రేవతి."

కవర్ని జేబులో పడేసుకుని ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. రెండు ఉత్తరాల్లోనూ రేవతి వివరంగా ఏదీ చెప్పనందుకు విచారించాను. తనకు జరిగినది మరెవరికైనా జరగొచ్చు! ఆమె అంతా రాసివుంటే ఇతర్లను కాపాడే అవకాశం పోలీస్ వారికి చిక్కివుండేది.

ఆమె వివరంగా ఎందుకు రాయలేదు? ఆమె మెదడు సక్రమంగా ఆలోచించే స్థితిలో లేదేమో!

* * *

ఇన్స్పెక్టర్ నాయర్ ఎదురుగా కూర్చున్నాను. గదిలో ఫాన్ తిరుగుతోంది. సిగరెట్ పీలుస్తూ అతనివైపు చూశాను. "బ్రదర్, మరో అమ్మాయి నిన్న రాత్రి మాయమైనట్లు పోలీస్ రిపోర్ట్ ఇవ్వబడింది," అన్నాడు నాయర్.

ఒక షీట్ను అతను నా కిచ్చాడు. దానిమీద అమ్మాయి పేరు, ఇంటి అడ్రెస్ అన్నీ వున్నాయి. మిస్ దేవిక!

"నాయర్ భాయ్, ఇది విచిత్రంగావుంది. బాజీరావుకి ఆమె రాసిన ఉత్తరం చదివేవా?"

"ఎవడో దుష్టుడు అందమైన అమ్మాయిలను కిడ్నాప్ చేసి తన సెక్స్ వాంఛలను తీర్చుకుని వదిలేస్తున్నాడు! మిస్ దేవిక తండ్రి మల్టీమిలీనియర్. ఏదో వెంటనే మనం చెయ్యకపోతే అతను వూరుకోడు!" అన్నాడు నాయర్.

నాయర్ తెప్పించిన కాఫీ తాగి కారెక్కాను. కీల్పాక్‌లోని హాడోస్ రోడ్డుకి కారును పోనిచ్చాను. నంబర్ ఇరవై గేటుముందు కారాపి చూశాను. గూర్ఖా వాచ్‌మన్ బయట పచార్లు చేస్తున్నాడు. కార్ను లోపలకు పోనిచ్చాను. పోర్టికోలో కారాపి దిగాను.

మూడంతస్తుల భవనం. రతన్‌లాల్ షా పేర్ను ఇంతకు ముందు ఎన్నిసార్లో విన్నాను. లైన్స్ క్లబ్, రోటరీ క్లబ్ మెంబరతను. లక్షలమీద విరాళాలు ఇస్తూవుంటాడు. దేవిక అతని కూతురు.

ఒక యువకుడు నావేపు వచ్చాడు.

"రతన్‌లాల్ షా వున్నారా?" అడిగాను.

"కూర్చోండి, సార్," అంటూ అతను నన్నొక హాలులోకి తీసుకువెళ్ళాడు.

పెద్ద హాలు. ఖరీదైన సోఫాలున్నాయి. ఒక యాంగ్లో ఇండియన్ యువతి నా దగ్గరకొచ్చింది. నన్ను గదిలోకి తీసుకొచ్చినతను ఆమెతో ఏదో చెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగించాను.

"యువర్ నేమ్ ప్లీజ్!" అందామె.

ఆమెకు నా కార్డిచ్చాను. పేరుచూసి ఆమె నాకేసి నవ్వుతూ తిరిగింది.

"కూర్చోండి. ఆయనతో చెప్తాను," అందామె.

అయిదు నిమిషాల తర్వాత ఆమె నన్ను పైకి రమ్మంది.

ఒక ఏర్ కండిషండ్ గదిలోకి ప్రవేశించాను. కుషన్డ్ సోఫాలో అతను కూర్చుని వున్నాడు. కాశ్మీర్ శాలువా కప్పుకున్నాడు. అతని ముఖంమాత్రం కొద్దిగా కనిపిస్తోంది. కళ్ళకు కళ్ళద్దాలున్నాయి. మఫ్లర్ తలనీ, గొంతునీ, చెవులనూ, కప్పేసింది.

ఎదురుగావున్న సోఫాలో కూర్చున్నాను. అతను నావైపు నవ్వుతూ చూశాడు.

"మిస్టర్ పరశురామ్, నేను కిందకి రావడానికి బదులు మిమ్మల్ని పైకి రప్పించినందుకు నన్ను క్షమించండి. ఈ మధ్య నా ఆరోగ్యం బాగాలేదు. ఇల్లు విడిచి ఎక్కడకీ వెళ్ళడంలేదు," అన్నాడు షా.

"డోంట్ బాదర్," అన్నాను.

యాంగ్లో ఇండియన్ యువతి గదిలోకి ట్రేతో వచ్చింది. ట్రేని నా ముందున్న టీపాయిమీద పెట్టింది.

"స్కాచ్ ప్లీజ్," అన్నాడతను.

"థాంక్స్. విస్కీ విత్ సోడా!" అన్నాను.

ఆమె రెండు గ్లాసుల్లో విస్కీ పోసి సోడా కలిపింది. ఒక గ్లాసును నాకిచ్చి రెండో గ్లాసును అతనికందించింది.

"రీతా, మాకేదేనా కావలిస్తే చూస్తూవుండు!" అన్నాడతను.

"యస్, బాస్," అని ఆమె వెళ్ళిపోయింది.

అతను గ్లాసును ఎత్తాడు. గ్లాస్ ఎత్తి, "చియర్స్!" అన్నాను. గ్లాసులోని విస్కీని తాగేసి సిగరెట్ వెలిగించాను.

"బెస్ట్ క్వాలిటీ స్కాచ్!" అన్నాను.

"థాంక్స్ టు స్మగ్లర్స్!" అన్నాడతను నవ్వుతూ.

"మీ అమ్మాయి మాయమైందని రిపోర్టిచ్చారట!" అని

సంభాషణని మార్చాను.

"దేవిక కాలేజీనుంచి ఇంటికి రాలేదు. కారుపంపాను. తోవలో కారుకి రిపేరొచ్చింది. దేవిక ఫోన్ చేసింది. కారు రాలేదంది. మరో కారు పంపుదామనుకున్నాను. ఫ్రెండ్ కారులో వచ్చేస్తానంది. వూరుకున్నాను. అమ్మాయి ఎంతకీ రాలేదు."

"ఏ ఫ్రెండ్ కారులో ఆమె వస్తానంది?"

"కమల కారులో. నా సెక్రెటరీ కమలకి ఫోన్ చేసి అడిగింది. దేవిక తన కారులో రాలేదందామె. దేవికను గురించి తనకేమీ తెలియదంది."

"ఏ చుట్టాల ఇంటికేనా ఆమె వెళ్ళుంటుందా?"

"చెప్పకుండా వెళ్ళదు!"

అతను వుష్ అన్నాడు. యాంగ్లో ఇండియన్ యువతి పరుగెత్తుకొచ్చింది. నా గ్లాసులో విస్కీ పోసి సోడా కలిపింది. ప్లేటులోవున్న చిప్స్, పీనట్సు నవుల్తూ మరికొంత విస్కీ తాగాను. ఉషారుగావుంది. అతనికేసి నవ్వుతూ చూశాను.

అతను గ్లాసులోని విస్కీని మెల్లిగా సేవిస్తున్నాడు. డబ్బున్న వ్యక్తికాని తన ధనాన్ని అనుభవించే ఆరోగ్యం లేదు.

"పరశురాంగారూ, ఎవరో అమ్మాయికి ఘోరంగా అపచారం జరిగిందని పేపర్లో చదివాను. నాకు చాలా గాభరాగా వుంది!"

"ఆమె సాధారణంగా ఎన్నింటికి ఇంటికొస్తుంది?"

"అయిదింటికి వచ్చేస్తుంది. నిన్న పద్దాకా చూసి, తర్వాత రిపోర్టివ్వమన్నాను. పరశురామ్‌గారూ, మీరు ఆమెకోసం వెతకండి. ఎంతేనా ఖర్చు పెట్టండి, నేనిచ్చు

కుంటాను," అన్నాడతను.

గ్లాసులు ఖాళీ చేశాను. నిషాగా వుంది. అతనికేసి సూటిగా చూశాను.

"మీకెంతమంది పిల్లలు?"

"ఒక్కగా నొక్క కూతురు. నా భార్య మరణించింది. తర్వాత నేను పెళ్ళాడలేదు."

అతను సౌజ్ఞ చేశాడు. ఆంగ్లో ఇండియన్ యువతి నావద్ద కొచ్చింది.

"అమ్మాయి ఫోటో వుందా?"

"రీతా, దేవిక ఫోటో ప్లీజ్," అన్నాడతను.

ఆమె విస్కీ పోసి, సోడా కలిపి వెళ్ళిపోయింది. పోస్ట్ కార్డ్ సైజు ఫోటోను పట్టుకొచ్చి నాకిచ్చింది. ఫోటోను చూడగానే దేవిక అంత అందమైన యువతి కాదనిపించింది! ఈమెను ఎవరేనా ఎత్తుకుపోతే మరేవో కారణాలు వుండొచ్చు!

గ్లాసులోని విస్కీని తాగేసి సోఫాలోంచి లేచాను.

"మిస్టర్ షా, థాంక్స్ ఫర్ ది డ్రింక్స్, వెళ్ళొస్తా," అన్నాను.

"రీతా, టేక్ హిమ్ టుది కార్!" అన్నా డతను నవ్వుతూ.

రీతా పక్కనే నడిచి మెట్లు దిగాను. పోర్టికోలో ఆపిన కారులో కూర్చుని తలుపు మూశాను. కారుపక్కనే రీతా నిలబడి వుంది. ఆమెవైపు చూసి తాపీగా నవ్వాను.

"దేవిక ఇంటికొస్తే నాకు ఫోన్ చేసి వెంటనే చెప్పు!" అన్నాను.

"యస్సార్," అందామె.

* * *

ఆమె అతనికేసి భయంతో చూసింది. ఆమె వయస్సు ముప్ఫయిదాటి వుంటుంది. చక్కటి పట్టుచీర కట్టుకుంది. చేతులకు బంగారం గాజులున్నాయి. మెళ్లో నగలు మెరుస్తున్నాయి. నుదురుమీద కుంకుమ బొట్టు!

"దగ్గరగా రా!" అన్నాడతను.

ఆమె జంకుతూ ముందుకు జరిగింది.

"పెళ్లయి పదేళ్లయినా నీ అందం పోలేదు!" అన్నాడతను.

"నేను ముసలిదాన్ని. వయస్సులో వున్న యువతుల ముందు నేనెందుకు పనికొస్తాను?" అందామె.

"సూరమ్మా, నిన్ను చూస్తే బాగా డబ్బు సంపాదిస్తున్నావనిపిస్తుంది," అన్నాడతను.

"మీ దయ," అందామె వినయంగా.

"ఈసారి పదిహేనేళ్ల దోర యువతిని తీసుకురా!"

ఆమె తలాడించి అతనికేసి చూసింది.

"నాకు రెండువేలు కావాలి!"

అతను ఇనప్పెట్టె తెరిచి ఆమెవైపు రెండు కట్టలు విసిరాడు. ఆత్రంగా ఆమె వాటినందుకొని తన హేండ్ బాగ్‌లో దాచుకొంది.

"వెళ్లివస్తాను, సార్," అందామె.

"గెట్ మి యంగ్ స్టఫ్!" అర్చాడతను.

ఆమె బయటకు గబగబా నడిచింది.

* * *

చీకటి పడ్తోంది. టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి "హాలో!" అన్నాను.

"మిస్టర్ పరశురామ్, బాస్ మాట్లాడతారు," అంది రీతా. పా కంఠం వెనువెంటనే వినపడింది.

"మిస్టర్ పరశురామ్, చాలా థాంక్స్! ఇప్పుడే అమ్మాయి ఇంటికొచ్చింది," అన్నాడు షా.

"ఏమైందిట?"

"ఆమెకు నేను భయపడిన విధంగా ఏ ప్రమాదమూ జరగలేదు. తన స్నేహితురాలితో ఆమె వాళ్ళింటికి వెళ్ళి పోయింది. అక్కడ వాళ్ళు పట్టుబట్టి ఆమెను వుండిపో మన్నారుట."

"కనీసం మీకామె ఫోన్ చేయవలసింది," అన్నాను.

"వాళ్ళింట్లో ఫోన్ లేదట. దగ్గరలో ఫోన్ లేదట. ఏదో చెప్పింది. చెడామడా తిట్టి యిటుపైన అలా ఎక్కడికీ వెళ్ళొద్దన్నాను. మిస్టర్ పరశురామ్, మీకు చాలా థాంక్స్!"

మెల్లిగా నవ్వాను.

"మిస్టర్ షా, మీ అమ్మాయి విషయంలో నేనింత వరకూ ఏమీ చేయలేదు. ఆమె యింటికి రావడం, మీ లక్!" అన్నాను.

"ఎనీవే, మీకు నా చెక్కు పంపుతున్నాను!"

"ప్లీస్, వద్దు! ఏ పనీ చేయకుండా డబ్బు తీసుకోవడం నాకిష్టం లేదు!"

రతన్‌లాల్ షా ఫక్కున నవ్వాడు.

"మిస్టర్ పరశురామ్, మీ మాటలు మీ గొప్ప తనాన్ని నిరూపిస్తున్నాయి! నేను వుంటాను," అని అతను రిసీవర్ పెట్టేశాడు.

* * *

పద్మజ ప్లాస్టిక్ బుట్ట పట్టుకొని పేవ్‌మెంటమ్మట వేగంగా అడుగులేస్తోంది. సాయంత్రం సమయం. సూర్యాస్త మయం అయింది, కాని ఇంకా చీకటి పడలేదు.

పద్మజ వయస్సు పదిహేనుంటుంది. సన్నగా, పొడుగ్గా వుంటుందామె. బంగారంలాంటి శరీర ఛాయ. స్కర్ట్, వైట్ బ్లౌస్ ధరించింది. రెండు జడలు!

ఎదురుగా వస్తూన్న స్త్రీ ఆమెకేసి సూటిగా చూసింది. ఆమె కళ్ళు మెరిశాయి, పద్మజను చూడగానే.

"అమ్మాయి, నువ్వేనా..." అని అడిగిందామె.

"నా పేరు పద్మజండి," అందామె అమాయకంగా.

"నీకోసమే వస్తున్నాను," అందామె.

"నాకోసమా, ఎందుకు?"

"అమ్మకి హార్ట్ ఎటాక్ వచ్చింది..."

"అమ్మెవరు? పిన్నా?"

"అదే పిన్నికి!" సరిదిద్దిందామె.

పద్మజ గాభరాగా ఆమెకేసి చూసింది.

"పిన్నెక్కడుంది?"

"ఇసబిల్లా హాస్పటల్లో. అక్కడకి వెళ్దాం, పద!"

పద్మజ ఆమెతో కొంచెం దూరం నడిచింది. ఒక కారు పక్కనే ఆగి ఆమె వెనుక తలుపు తెరిచింది.

"ఎక్కమ్మా, కారులో తొందరగా వెళ్ళొచ్చు!" అందామె.

పద్మజ వుషారుగా కారులో కూర్చుంది. ఆమెపక్కనే కూర్చుని తలుపు మూసింది. ముందు సీటుమీద వున్నతను కారును పోనిచ్చాడు. పద్మజ వెనుక నడుస్తూన్న తన క్లాస్ మేట్ శంకర్ వైపు చూసింది.

కారు ఎక్కడికో పోతోంది. ఇసబిల్లా హాస్పిటల్ ఎక్కడున్నదీ పద్మజకు తెలుసు.

"ఇసబిల్లా హాస్పిటల్ దాటి వచ్చేశాం!" అందామె.

"ప్రాణం పోదులే!" అందామె కటువుగా.

నవ్వుతూ తనని పలకరించిన స్త్రీ ముఖంలో ఇప్పుడు నవ్వు లేదు. పిశాచంలా అగుపిస్తోందామె.

"నన్ను పోనివ్వండి!" అంది పద్మజ.

"ఎక్కడకి పోతావు?" అందామె పరిహాసంగా.

"హాస్పిటల్ కి వెళ్ళి పిన్నిని చూస్తాను."

"బోనులో ఇరుక్కున్న ఎలుకను వదిలేయరు!"

పద్మజ వులిక్కిపడింది. నల్లటి గుడ్డను తీసి ఆమె పద్మజ కళ్ళను కప్పేసి వెనుక బిగించి కట్టింది. కారు స్పీడుగా వెళ్తోంది. ఎటు వెళ్తోందో ఆమె చూసే స్థితిలో లేదు.

"నన్నెక్కడకి..." పద్మజ అడగబోయి మధ్యలో ఆగింది.

"నోరు మూసుకుని కూర్చో. అల్లరిచేస్తే కష్టపడవలసి వస్తుంది. బుద్ధిగావుంటే త్వరలో నీ ఇల్లు చేరుకుంటావు," అందామె.

పద్మజ మరే ప్రశ్నలూ వెయ్యలేదు. కారు ఆగింది. ఆమెను దింపి, ఎవరో నడిపించి తీసుకుపోయారు. కొంత సేపయ్యాక నల్లగుడ్డ తీసివేయబడింది. కళ్లు చిట్లించి పద్మజ నలువైపులా చూసింది. అందమైన గది, గది కిటికీ తలుపులు మూసి వున్నాయి.

ఎదురుగా ఆమె నిలబడివుంది.

ఏడుస్తూ పద్మజ ఆమెకు నమస్కరించింది.

"మీకు దణ్ణం పెడ్తాను, నన్ను పోనీయండి!"

"పని పూర్తయ్యాక వెళ్దువుగాని!"

"నాతో మీకు పనేముంది?"

ఆమె పిశాచంలా నవ్వింది.

"నీలాంటి అందమైన పిట్టతో పనున్న వ్యక్తి కాస్సేపట్లో వస్తారు!" అందామె.

"నన్నేం చేస్తావు?"

"తెలియనట్లు అడుగుతున్నావే! ఈనాటి పిల్లలకు అన్నీ తెలుసు!" అందామె.

పద్మజ గుండె దడదడ కొట్టుకుంది. ఆమె గదిలోంచి బయటకు వెళ్ళి తలుపు మూసి గొళ్ళెం పెట్టింది.

* * *

పద్మజ ఎదురుగా అతను నిలబడ్డాడు. తలుపు మూసి వుంది. అతడిని చూడగానే ఆమె భయంతో వెనక్కి జరిగింది. కుష్ఠురోగి! శిథిలమైన పురాతన విగ్రహంలా శరీరం అనేక చోట్ల చీలేసింది. రసి కారుతోంది!

అతని కళ్లు ఆకలితో ఆమెను తినేస్తున్నాయి. అతను ముందుకు వెళ్ళాడు. ఆమె గోడ వారగా నిలబడింది. ఎదురుగా నిలబడ్డాడతను. ఆమె ధరించిన బ్లౌస్‌ను చించి, గట్టిగా లాగాడు. బ్రాసియర్‌లో దాగివున్న ఆమె బిగువైన స్తనాల కేసి ఆకలితో చూశాడు.

ఆమె ఏడుస్తోంది. కళ్ళమ్మట, ముక్కుమ్మట నీళ్ళు కారుతున్నాయి.

"నన్ను పోనీ! అరుస్తాను!" అందామె.

అతను పిచ్చివాడిలా నవ్వాడు.

"అరిస్తే నిన్ను రక్షించడానికి ఎవ్వరూ రారు! నువ్వు అరవగానే ఏ కృష్ణుడో వచ్చి కాపాడే రోజులు కావివి!" అన్నాడతను.

"నీకేం కావాలి?" అడిగిందామె.

"నువ్వు కావాలి. అందంగా వున్నావు. నిన్ను ఒల్చుకు నమిలేస్తాను!" అన్నాడతను.

"నన్ను చంపకు!"

"అడ్డురాకుండా నాకు లొంగిపో! ప్రాణంతో ఇంటి

కిడ్తావు. నన్ను ఎదిరిస్తే నీకే ప్రమాదం!'' గర్జించేడతను.

* * *

టైమ్ పది దాటింది. పాత ఇంటిముందు కారాపాను. దిగి ఇంటికేసి చూశాను. లైట్లన్నీ వెలుగుతున్నాయి. లోపలకు వెళ్ళాను. ఒక స్త్రీ నాకు నమస్కరించి కూర్చో మంది. ఆమె పక్కనే సన్నగా, పొట్టిగావున్న ఒక పురుషుడు చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు.

కుర్చీలో కూర్చొని వాళ్ళిద్దరి వైపూ చూశాను.

''ఇతను నాభర్త, నా పేరు రమణి. అక్కయ్య కూతురు పద్మజ యిక్కడ మాతో వుంది. చదువుకుంటోంది. అది ఇంటికి రాలేదు,'' అందామె.

''మీరు వెంటనే పోలీస్ రిపోర్ట్ యిచ్చుంటే బాగుండేది. తొమ్మిది దాకా కాలయాపన చేస్తూ కూర్చున్నారు,'' అన్నాను.

''యూ ఆర్ రైట్, సార్,'' అన్నాడామె భర్త.

ఆమె అతని వైపు కోపంగా చూసింది.

''రాజూ, ఇదంతా నేను చూస్తాను. నువ్వెళ్ళి పడుకో!'' అందామె.

మూతికాలిన పిల్లిలా అతను లోపలకు వెళ్ళిపోయాడు.

''పద్మజ ఫోటో ఇది. దాని వయస్సు పదిహేను లోపున వుంటుంది,'' అందామె.

ఫోటో చూశాను. పద్మజ బంగారం బొమ్మలావుంది.

''మీరు ఏం చేస్తున్నారు?'' అడిగాను.

''నేను పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్స్‌లో పనిచేస్తున్నాను పి. ఎమ్. జి. ఆఫీసులో,'' అందామె.

''పద్మజకి ఎవరేనా బాయ్ ఫ్రెండ్స్ వున్నారా?''

''అది ఎసెస్ ఎల్సీ చదువుతోంది, సార్. ఈ మధ్యనే

పెద్ద మనిషైంది. దానికి బాయ్ ఫ్రెండ్స్ ఏమిటి?"
అందామె.

"ఆల్ రైట్, దర్యాప్తు చేస్తాను," అని బయటకు నడిచాను.

రోడ్డు మీదున్న కారెక్కి తలుపు మూశాను. ఎవరో కారు వైపు పరుగెత్తుకొచ్చారు. పదహారేళ్ళ యువకుడు. వైట్ పాంట్, స్లాక్ ధరించాడు. నూనూగు మీసాలు!

దగ్గరలోవున్న స్ట్రీట్ లైట్ కాంతిలో అతను స్పష్టంగా కనిపిస్తున్నాడు.

"సార్! పద్మజ ఏమైంది?" అడిగాడతను.

"నువ్వెవరు?" ప్రశ్నించాను.

"నా పేరు శంకర్. ఆమె క్లాస్ మేట్ ని. ఇందాక పోలీస్ జీప్ వచ్చి వెళ్ళింది. ఇప్పుడు మీరొచ్చారు!"

"పద్మజ స్కూలునుంచి ఇంటికి రాలేదు. ఆమెను గురించి నీకేదేనా తెలుసా?"

"తెలుసు. అది చెప్పాలనే ఇలా వచ్చాను."

"ఏం తెలుసు?"

"స్కూల్ అవగానే ఆమె ఇంటికి నడుస్తోంది. వెనకనే నేను నడుస్తున్నాను. ఎవరో స్త్రీ ఆమెను పలకరించింది. ఇద్దరూ కొంతదూరం నడిచి కారులో ఎక్కారు. కారులో కూర్చుని పద్మజ నావైపు చూడ్డం నాకింకా గుర్తుంది."

"కారులో ఎంతమంది వున్నారు?"

"ఆమెను పలకరించిన స్త్రీ కాక ముందు సీటులో డ్రయివర్ వున్నాడు."

"కారు నెంబర్ చూశావా?"

అతను బట్టీ పట్టిన కారు నంబర్ని నాకు చెప్పాడు.

అతని భుజంమీద చెయ్యివేశాను.

"మైడియర్ ఫ్రెండ్, నువ్వు చూసి చెప్పింది మాకెంతో వుపయోగపడ్తుంది. ఎక్కడుంటున్నావు?"

"ఇదే వీధిలో, అదుగో ఆ ఇల్లు," అని మూడో ఇంటి కేసి అతను చెయ్యి చూపించాడు.

"ఆ స్త్రీని మళ్ళీ చూస్తే పోల్చగలవా?"

"పోల్చగలను సార్," అన్నాడతను.

"అవసరమైతే నిన్ను మళ్ళీ కల్సుకుంటాను," అన్నాను.

"పద్మజకి ఏ ప్రమాదం రాకుండా చూడండి, సార్. ఆమె చాలా మంచిది!" అన్నాడతను.

కారును పోనిచ్చాను. పోలీస్ హెడ్ క్వార్టర్స్ కాంపౌండులో కారాపి ఇన్ స్పెక్టర్ నాయర్ ఆఫీసులోకి వెళ్లాను.

నాయర్ కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. నా బూట్లచప్పుడు విని లేచి ఆవులిస్తూ నావైపు చూశాడు.

"బ్రదర్, కూర్చో!" అన్నాడతను.

అతనికి కారునంబర్ చెప్పాను.

"నాయర్ భాయ్, ఆ కారు ఎవరిదో కనుక్కో!"

ఇన్ స్పెక్టర్ నాయర్ నంబర్ తిప్పి యెవరితోనో మాట్లాడుతున్నాడు. ఆలోచిస్తూ సిగరెట్ పీలుస్తున్నాను. అందరూ దేవికలా అదృష్టవంతులు కాకపోవచ్చు. రేవతి జపిస్తోంది!

"ఆ కారు భాస్కర్ నాయర్‌ది. అతను టాంక్ స్ట్రీట్ మైలాపూర్, పదో నెంబర్ ఇంట్లో ఉండాలి!" అన్నాడు నాయర్.

వేగంగా బయటకు వెళ్ళాను. డాడ్జికారును కపాలీ టాంక్ వైపు పోనిచ్చాను. ఒక ఇంటిముందు పాత అంబాసిడర్ కారు ఆగివుంది. అదే నంబర్.

కిందకిదిగి వీధితలుపును తట్టాను. ఒకతను లేచివచ్చి కటకటాల తలుపు తెరిచాడు. లోపలకు దూకి అతనికేసి సూటిగా చూశాను.

"ఈకారు నీదేనా?"

"నాదేసార్!" అన్నాడతను.

"సాయంత్రం ఆయిదు ప్రాంతంలో ఆ కారులో ఒక అమ్మాయి ఎక్కింది. ఆమెను యెక్కడ దింపావు?"

కాసేపు అతను మాట్లాడలేదు. నావైపు చూస్తూ వుండిపోయాడు.

"సార్, నేను కార్పొరేషన్ ఆఫీసులో పనిచేస్తున్నాను. ఆ కారును ప్రయివేట్ టాక్సీగా నడుపుతున్నాను. డ్రైవర్ని అడిగితే ఆ కారు యెక్కడకివెళ్ళిందీ తెలుస్తుంది" అన్నాడతను.

"డ్రైవర్ ఇల్లెక్కడ?"

"పల్లాతోపులో వుంది."

"అక్కడకు వెళదాం, తొందరగా రా!" అన్నాను.

అతను లోపలకు వెళ్ళి చొక్కా తొడుక్కొని వచ్చాడు. తలుపు మూసుకోమని భార్యతో చెప్పి అతను కార్లో కూర్చున్నాడు. కారును స్పీడుగా పోనిచ్చాను.

* * *

అతని చేతులు ఆమెను చుట్టేశాయి. పద్మజ అతని ముఖంమీద వుమ్మింది.

"ఛీ, దుర్మార్గుడా! రోగిష్టి వెధవ్వి!" అరిచిందామె పళ్ళు కొరుకుతూ.

"నీకు కావలసినంత డబ్బిస్తాను!"

"నీడబ్బు ఎవరికి కావాలి, పొయ్యిలో పెట్టుకో!" అందామె.

అతనామెను తనవైపు లాక్కున్నాడు. ఆమె అతని

పొట్టమీద తన్నింది. అతను వెనక్కి పడ్డాడు. క్రోధంతో ఆమెకేసి చూశాడు.

"నిన్ను నాశనం చేస్తాను!" అర్చాడతను.

ఆమె పరిహాసంగా నవ్వింది.

"కుష్టురోగం నిన్ను నాశనం చేస్తోంది!" అందామె.

అతనిమూతి వంకరబోయింది. అతను గుమ్మంవైపు వెళ్ళి తలుపు తెరిచాడు. బయట కూర్చునివున్న స్త్రీకేసి తీక్షణంగా చూశాడు. ఆమె తమలపాకులు నవుల్తోంది.

"పిట్ట లొంగటంలేదు!" అన్నాడతను.

"మరో వెయ్యి రూపాయిలిలా పడేయి! కాళ్ళూ చేతులూ విర్చి పట్టుకుంటాను. ఆటుపైన మీరు అమృతాన్ని సులువుగా తాగొచ్చు" అందామె.

"అందరికీ నీలా డబ్బాశవుంటే బాగుండేది!" అన్నాడతను.

"యూ ఆర్ రైట్, బాస్," అందామె.

అతను మరో గదిలోకెళ్ళి ఒక నోట్లకట్టను తెచ్చి ఆమెకిచ్చాడు. డబ్బును ఆమె హేండ్ బాగ్‌లో పడేసుకుంది. ఆమె చొరవగా గదిలోకి నడిచింది. అతను లోపలకెళ్ళి తలుపు మూశాడు.

"మిమ్మల్ని ఎవరు కాదనగలరో చూస్తాను," అర్చిందామె, పద్మజ కేసి పిశాచంలా కదుల్తూ.

* * *

నేలమీద పద్మజ వెల్లకిలా పడుంది. చేతుల్ని వెనక్కి లాగి ఆమె బలంగా పట్టుకుంది. పద్మజ ఆమెకేసి హీనంగా చూసింది.

"నువ్వు భారతదేశంలో వుండవలసిన స్త్రీవి కావు! నాలాటి అమాయకురాలి జీవితాన్ని నాశనం చేస్తూన్న అతనికి సహాయపడ్డం మహా పాపం! మరో జన్మలో కప్పయి

పుడ్తావు!" అర్చింది పద్మజ.

"నీ ఇష్ట మొచ్చినట్లు శపించు! కప్పగానే సుఖంగా జీవిస్తాను," అని ఆమె అతని వైపు చూసింది.

"కానివ్వండి, బాస్!" అందామె.

అతను ఆమె వైపు వంగాడు. తటాలున ఎవరో బూట్ కాలుతో తలుపును తన్నారు. తలుపు చటుక్కున తెరుచుకుంది.

పద్మజను పట్టుకున్న స్త్రీ లోపలున్న బాత్ రూమ్ లోకి దూరి తలుపు మూసుకుంది. అతను లేచి వెనక్కి తిరిగాడు.

"మిస్టర్ రతన్ లాల్ షా, ఆనాడు కదలలేని వాడిలా నా ముందు నటించావు! డర్టీ రాస్కెల్!" అర్చాను గంభీరంగా.

పద్మజ లేచింది. నా దగ్గరగా వచ్చి నిలబడింది. వణుకుతున్న ఆమె చేతులు నన్ను చుట్టేశాయి.

చిరిగిన ఆమె దుస్తుల వైపు విచారంతో చూశాను. ఆమె కళ్ళమ్మట నీళ్ళు జలజల కారాయి.

"దేవుడిలా వచ్చి నా మానాన్ని కాపాడారు. మిమ్మల్ని యీ జీవితంలో మర్చిపోను!" అందామె.

"పద్మజా, యూ ఆర్ లక్కీ! నిన్ను కాపాడింది నీ క్లాస్ మేట్ శంకర్. అతను చూసి నాతో చెప్పినది నిన్నిక్కడకు తీసుకొచ్చింది," అన్నాను ఆమెను నిమురుతూ.

* * *

గదిలో ఫ్లోరసెంట్ లైట్ వెలుగుతోంది. కుర్చీలో షా కూర్చుని వున్నాడు. అతని చేతులకు బేడీలున్నాయి. ఇన్ స్పెక్టర్ నాయర్, నేనూ అతని కెదురుగా నిలబడి వున్నాం.

"మిస్టర్ షా, అనేకమందికి ఎంతో డబ్బిచ్చావు! ఇంత నీచస్థితికి ఎందుకు దిగజారావు?" అడిగాను.

అతను జవాబివ్వలేదు. తన చేతులను చూసుకుని ఏడుస్తున్నాడు.

"రేవతిని రేప్ చేసి వదిలేశావు. ఆమె నూతిలో పడి ఆత్మహత్య చేసుకుంది. పశువులా ఎందుకిలా పతనమయ్యావు?"

"మిస్టర్ పరశురామ్, చిన్నప్పటినుంచీ నేను కుష్టురోగిని. లక్షలకు లక్షలు గడించాను. అందరూ డబ్బుకోసం నావద్ద కొచ్చేవారు, కాని లోలోపల నన్ను చూసి అసహ్యించుకునేవారు. నాలుగు సార్లు నేను పెళ్ళాడాను. నా భార్యలు నన్ను దగ్గరకు రానిచ్చేవారుకారు. నన్ను చూసి ఆక్షేపించేవారు. నా భార్యలు నన్ను వదిలి వెళ్ళిపోయారు. ఎంత డబ్బు గణించినా సాధారణ మానవుడికుండే దాంపత్య సుఖం నాకు లేకుండా పోయింది!

"తీరని కోర్కెలు మనిషిని వదలవు! దానితో నా కపట జీవితం ప్రారంభమైంది. ఎలాగో నా కోర్కెలను తీర్చుకోవాలి. అందుకోసం ఏం చేసినా పాపం లేదనిపించింది! నా స్థితిలో వుంటే ఎవరైనా ఇలాగే చేసేవారేమో!" అన్నాడు షా.

అతని వైపు చూస్తూ సిగరెట్ వెలిగించాను. ఇన్స్పెక్టర్ నాయర్ నాచెయ్యి పట్టుకున్నాడు.

"థాంక్స్ బ్రదర్. సూరమ్మనీ, షానీ కస్టడీలో వుంచి వాళ్ళమీద చార్జిషీట్ ఫైల్ చేస్తాం," అన్నాడు నాయర్.

టైమ్ చూశాను. పన్నెండు దాటింది.

"గుడ్ లక్ అండ్ గుడ్ నైట్," అని నాయర్ తో చెప్పి పోర్టికోలో వున్న డాడ్జికారు వైపు నడిచాను.

—: ఐపోయింది :—